# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 25 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## 27న దేశవ్యాప్తంగా బ్యాంకులు బంద్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని ప్రధాన బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. జనవరి 27న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ రోజు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపింది. జనవరి 26 అర్ధరాత్రి నుంచి 27 అర్ధరాత్రి వరకు సమ్మె కొనసాగుతుందని ఎన్డీటీవీ ప్రాఫిట్ నివేదిక పేర్కొంది.తొమ్మిది బ్యాంకు ఉద్యోగ సంఘాల ఉమ్మడి వేదిక అయిన యూఎఫ్‌బీయూ, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్--1947 ప్రకారం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), చీఫ్ లేబర్ కమిషనర్ మరియు ఆర్థిక సేవల విభాగానికి (డీఎఫ్ఎస్) సమ్మె నోటీసు పంపింది. అన్ని శనివారాలను సెలవు దినాలుగా ప్రకటించి, ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని యూనియన్లు స్పష్టం చేశాయి.ఈ ప్రతిపాదనకు ఇప్పటికే ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ఆమోదం తెలిపి, ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని యూనియన్లు గుర్తుచేశాయి. 2023 డిసెంబర్ 7న ఐబీఏ-యూఎఫ్‌బీయూ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకే ఈ సిఫార్సు జరిగిందని తెలిపారు.అయితే, ప్రభుత్వ నియంత్రణ సంస్థల నుంచి తుది ఆమోదం లభించడంలో 9 నెలలకు పైగా జాప్యం జరుగుతోందని, ఈ నిర్లక్ష్య ధోరణికి నిరసనగానే సమ్మెకు దిగాల్సి వచ్చిందని యూఎఫ్‌బీయూ పేర్కొంది. పనిదినాలు తగ్గినా, మొత్తం పనిగంటలు తగ్గకుండా ఉండేందుకు రోజు వారీ పనివేళలను 40 నిమిషాలు పెంచేందుకు కూడా యూనియన్లు అంగీకరించాయని వెల్లడించింది.

## స్టార్టప్‌ల కేంద్రంగానే టీ-హబ్ కొనసాగించాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- అమెరికా నుంచి సీఎస్‌తో మాట్లాడిన ముఖ్యమంత్రి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

టీ-హబ్‌ను పూర్తిగా స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను టీ-హబ్‌కు తరలిస్తున్నారన్న వార్తలపై సీఎం వెంటనే స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.



స్టార్టప్‌లకు ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా ఏర్పాటు చేసిన టీ-హబ్‌లో ఇతర కార్యాలయాలు ఉండకూడదని, అలాంటి ఆలోచనలు ఉంటే విరమించుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## సింగరేణిపై కట్టుకథలతో దుష్ప్రచారం



- ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం
- తప్పుడు కథనాలు రాస్తే ఊరుకోను
- టెండర్లు దక్కించుకున్నది బీఆర్ఎస్ నేతల
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణకు ఆత్మగా నిలిచిన సింగరేణి సంస్థపై కట్టుకథలు, ఊహాగానాలతో కథనాలు ప్రచారం చేస్తూ ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడుల పేరుతో ఒక పత్రిక రాసిన "విషపు కథనం"తోనే ఈ వివాదం మొదలైందని ఆయన గుర్తు చేశారు. రోజుకో కథ అల్లుతూ ఎవరి ప్రయోజనాల కోసం, ఏ దోపిడీదారుల కోసమో ఈ కథనాలు వస్తున్నట్లుగా అనిపిస్తోందని వ్యాఖ్యానించారు.కొద్దిమందికి లబ్ధి చేకూర్చేందుకే సింగరేణిలో 'సైట్ విజిట్?' అనే నిబంధన తీసుకొచ్చారని ఊహించుకుని కథలు రాశారని మండిపడ్డారు. అనుకున్న వ్యక్తులకు టెండర్లు ఇవ్వడానికే నిబంధనలు మార్చారని ప్రచారం చేస్తున్నారని, ఒక పత్రిక కథనం ఆధారంగా మరో నేత లేఖ రాయడం దురదృష్టకరమన్నారు.

సింగరేణి ఒక స్వయం ప్రతిపత్తి (ఆటానమస్) సంస్థ అని, ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. సంస్థలో నిర్ణయాలు నిర్దిష్ట విధి విధానాల ప్రకారమే జరుగుతాయని తెలిపారు. ఆరోపణలు రావడంతో అపోహలు పెరగకుండా ఉండేందుకే టెండర్లను రద్దు చేయాలని తాను సూచించానని, తరువాత అయినా తప్పు గ్రహించి సరిదిద్దుకుంటారని భావించానని అన్నారు. సైట్ విజిట్ నిబంధన కొత్తది కాదని, కోల్ ఇండియా 2018లోనే ఈ విధానాన్ని అమలు చేసిందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. అదే విధంగా సింగరేణి సంస్థ 2021లో సైట్ విజిట్ తప్పనిసరిగా అమలు చేసిందని తెలిపారు. ఆ సమయంలో తాము అధికారంలో లేమని ప్రశ్నించారు. సెంట్రల్ మైనింగ్, డిజైనింగ్ అండ్ ప్లానింగ్ సంస్థతో పాటు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్ఎండీసీ కూడా 2021లో బిడ్డర్లు సైట్ విజిట్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలనే నిబంధన పెట్టిందని చెప్పారు. దేశంలోని అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు---రైల్వే, హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థల్లోనూ ఇదే విధానం అమలులో ఉందని వివరించారు.

"తెలంగాణ ఆస్తులను పరిరక్షించడం నా బాధ్యత. మండుటెండల్లో సింగరేణి ప్రాంతంలో పాదయాత్ర చేశాను. మంచి నాణ్యత గల బొగ్గు గనులను సింగరేణి దక్కించుకునేలా కృషి చేస్తున్నాం. బొగ్గుతోనే కాకుండా కీలక ఖనిజాల మైనింగ్ వైపు సంస్థను తీసుకెళ్తున్నాం. నా పరువు, ప్రతిష్టను భంగం చేసేలా తప్పుడు కథనాలు రాస్తే ఊరుకోను. 40 ఏళ్లుగా సంపాదించుకున్న ప్రతిష్టను ఒక్క కథనంతో దెబ్బతీయలేరు" అని హెచ్చరించారు. టెండర్లు దక్కించుకున్నది బీఆర్ఎస్ నేతలేనని కూడా డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధన దేశంలో ఎక్కడా లేదన్నట్లు దుష్ప్రచారం చేశారని, దురుద్దేశంతో రాసిన కథనం ఆధారంగా లేఖలు రాయడం తగదన్నారు. నైనీ కోల్ బ్లాక్‌కు బీఆర్ఎస్? హయాంలోనే టెండర్లు పిలిచారని, సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టుల్లో 20 టెండర్లు బీఆర్ఎస్ పాలనలోనే జరిగినట్లు వివరించారు.


సృజన్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన భట్టి విక్రమార్క, కల్యాణఖని, ఆర్జీ ఓసీ-2, ఎస్ఆర్‌పీ-ఓపీ2 తదితర టెండర్లు దక్కించుకున్న సంస్థలు బీఆర్ఎస్ నేతలకు సంబంధించినవేనని తెలిపారు. పారదర్శక టెండర్ల విధానం వల్లే రాజకీయ భేదాలు లేకుండా అర్హులైన వారందరికీ అవకాశాలు లభిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

## ఫిబ్రవరి 12 'సార్వత్రిక సమ్మె'కు బీఆర్ఎస్ మద్దతు

- మాజీ ఎంపీ వినోద్ కుమార్


**బలగం టీవీ, హైదరాబాద్:**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మరియు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో నడుస్తోందని, అటు బీజేపీ అయినా, ఇటు కాంగ్రెస్ అయినా కార్మికుల పట్ల ఒకే రకమైన ధోరణిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. యాజమాన్యాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయి. దోపిడీ ఉన్నంత వరకు కార్మిక సంఘాల పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. కేంద్రం తీసుకొచ్చిన 4 నూతన లేబర్ కోడ్ చట్టాల వల్ల కార్మికులకు జరిగే నష్టాన్ని ప్రజలకు, క్షేత్రస్థాయిలోని కార్మికులకు వివరించాలి. 10 నిమిషాల




డెలివరీ నిబంధన వంటి అశాస్త్రీయ నిర్ణయాల వల్ల గిగ్ వర్కర్లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటువంటి నిబంధనలను తక్షణమే ఎత్తివేయాలి. ప్రభుత్వం శ్రమను 'హక్కు'గా కాకుండా 'ధర్మం'గా పరిగణించాలని చూడటం సరైనది కాదు. ఫిబ్రవరి 12న నిర్వహించబోయే సమ్మెలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొంటాయని వినోద్ కుమార్ స్పష్టం చేశారు. కార్మిక లోకమంతా ఏకమై ఈ సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని గిగ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని ఈ సందర్భంగా పార్టీ నేతలు ప్రతిజ్ఞ చేశారు.

## రామగుండంలో 8 మంది మావోయిస్టుల లొంగుబాటు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఎనిమిది మంది మావోయిస్టులు శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మిలీషియా, కొరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ మావోయిస్టులున్నారు. వీరు ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ మాట్లాడుతూ.. ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడి మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి వచ్చినట్టయితే, తెలంగాణ ప్రభుత్వం పునరావాస పథకాలు, ఇతర సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వారు స్వతంత్రంగా జీవించే విధంగా ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. లొంగిపోయిన సభ్యులకు ప్రభుత్వం తరపున అన్ని ప్రతిఫలాలనూ అందజేయడానికి రామగుండం కమిషనరేట్ పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. సమాజంలో యువత చైతన్యవంతంగా వ్యవహరిస్తోందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటోందని, మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్మెంట్ పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. అజ్ఞాతంలో ఉన్న ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా మావోయిస్టులు కూడా వారి గ్రామాలకు తిరిగి రావాలని కోరారు.లొంగిపోయిన వారిలో వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామానికి చెందిన ధర్మాజీ శ్రీకాంత్ (మావోయిస్టు కొరియర్), పొడియం కాములు (మిలీషియా కమాండర్), ముడియం జోగ (సాంస్కృతిక ప్రచార కార్యకర్త), కుంజం లక్కె (పార్టీ మెంబర్), మోదం భీమ (మిలీషియా సభ్యుడు), కుంజం ఉంగా (జీఏడీ కమాండర్), ముడికం సుక్రం (మిలీషియా సభ్యుడు), ముడియం మంగు (మిలీషియా సభ్యుడు) ఉన్నారు. కాగా, ఇందులో శ్రీకాంత్ ఒక్కడే తెలంగాణ వ్యక్తి. మిగిలిన వాళ్ళందరూ ఛతీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గాంగేలురు పోలీస్ స్టేషన్ పరిధి గంపుర్ గ్రామస్తులు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఎఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్లు రాజేంద్ర ప్రసాద్, భీమేష్, ఆర్ఐ శేఖర్, ఆర్ఎస్ఐలు వెంకట్, శివ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

- నాంపల్లిలోని ఫర్నిచర్ షాపులో చెలరేగిన మంటలు
- మంటల్లో చిక్కుకున్న నలుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు
- అదుపులోకొచ్చిన మంటలు
- ఆరుగురి కోసం రాత్రి కొనసాగుతున్న సహాయక చర్యలు
- రోబో, ఎన్డీఆర్ఎఫ్‌తో రెస్క్యూ ఆపరేషన్
- సహాయక చర్యలో జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి, మెడికల్, విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది






**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నాంపల్లిలోని బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ దుకాణంలో గురువారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.మంటలను అదుపులోకి తెచ్చేందుకు రెస్క్యూ టీం శనివారం రాత్రి కూడా సహాయక చర్యలు కొనసాగించింది. రాత్రి 10 గంటల వరకు మంటలు అదుపులోకి వచ్చినా దట్టమైన పొగ కమ్ముకోవడంతో సిబ్బందికి లోపలికి వెళ్లడం ఇబ్బందిగా మారింది. లోపల ఉన్న వారి పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

అబిడ్స్ జీపీఓ నుంచి నాంపల్లి వెళ్లే దారిలో నాలుగు అంతస్తుల్లో సాయి విశ్వాస్ చాంబర్స్, ఫర్నీచర్ క్రిస్టల్, ఫర్నీచర్ క్యసిల్, శుభ్ ఫర్నీచర్స్ పేర్లతో దుకాణాలున్నాయి. సెల్లార్‌ను గోదాంగా ఉపయోగిస్తున్నారు. గోదాంలో అట్టలు, చెక్కలతో చేసిన ఫర్నీచర్, ఫోమ్, థర్మకోల్, ప్లాస్టిక్‌తోపాటు ఇతర సామగ్రిని నిల్వ చేశారు. అయితే శనివారం మధ్యాహ్నం సమయంలో సెల్లార్ నుంచి పొగలు వచ్చాయి. క్షణాల వ్యవధిలో భారీగా మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఆందోళనకు గురైన స్థానికులు, సమీప దుకాణాదారులు వెంటనే అబిడ్స్ పోలీసులతోపాటు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి నాలుగు అంతస్తుల వరకు మంటలు వ్యాపించడంతో ఆ ప్రాంతం అంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. సెల్లార్ అంతా ఫర్నీచర్ ఉండటంతో రెస్క్యూ ఆపరేషన్‌కు కష్టంగా మారింది. దాంతో బాహుబలి క్రెయిన్, జేసీబీతో ఫర్నీచర్ తొలగించారు. పై అంతస్తు వరకు బాహుబలి క్రెయిన్ సహాయంతో సుత్తెలతో అద్దాలను పగలగొట్టారు. ఇరుకైన గల్లీలో పెద్దఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఎన్‌డీఆర్ఎఫ్, సివిల్, ర్యాపిడ్ యాక్షన్ బృందాలను రంగంలోకి దించారు.మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు 16 ఫైరింజన్లు ఉపయోగించారు.

దుకాణం యజమాని సంతోష్ కొన్నేండ్లుగా ఫర్నీచర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అందులో వాచ్‌మెన్‌గా మాల్‌కు చెందిన యాదయ్య, లక్ష్మి దంతులుంటున్నారు. వారికి అఖిల్(7), ప్రణీత(11) సంతానం. అంతా కలిసి సెల్లార్‌లోనే నివాసముంటున్నారు. పిల్లలు స్థానిక స్కూల్‌లో చదువుతున్నారు. నాంపల్లి సుభాన్‌పూర్‌కు చెందిన మొహ్మద్ హుస్సేన్ ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. శాస్త్రీపురానికి చెందిన సయ్యద్ ఆబిద్ కూడా శుభ్ ఫర్నీచర్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అయితే ఉదయమే యాదయ్య, లక్ష్మి దంపతులు పిల్లలను సెల్లార్‌లో ఆడుకోవాలని చెప్పి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సెల్లార్ నుంచి దట్టమైన పొగ వస్తుండటాన్ని గమనించిన సయ్యద్ ఆబిద్, మహ్మద్ హుస్సేన్, మేనేజర్ ఇంతియాజ్ పిల్లలను రక్షించేందుకు లోపలికి వెళ్లారు. అప్పటికే మంటలు, పొగ కమ్ముకోవడంతో వారు కూడా అందులో చిక్కుపోయారు. వారితో పాటు స్వీపర్‌గా పనిచేస్తున్న 60 ఏండ్ల వృద్ధురాలు సైతం సెల్లార్‌లో ఉండిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. బాహుబలి క్రెయిన్, జేసీబీల సహాయంతో భవనంలో ఉన్న వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమించింది. గాలి పీల్చుకోవడం ఇబ్బందిగా మారడంతో లోపల ఉన్న వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది.

## నైనీ టెండర్ రద్దు చేశారంటే స్కాం జరిగినట్టే కదా




- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సింగరేణి బొగ్గు, సోలార్ టెండర్ల వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన ప్రెస్‌మీట్‌ను మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక భట్టి విషయాలను పక్కదారి పట్టించారని ఆయన ఆరోపించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే స్కాం జరిగిందనే నిదర్శనమని, మరి అదే తరహాలో మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే సోలార్ పవర్ స్కాంపై ప్రెస్‌మీట్‌లో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం 'ఎక్స్?' వేదికగా స్పందించిన ఆయన, నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి విక్రమార్క మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని విమర్శించారు. స్కాంలు స్కీంలుగా మారవని, సైట్ విజిట్ నిబంధనలను చూపించి నిజాలను దాచలేరని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ మొత్తం తతంగం జరిగిందని ఆరోపిస్తూ, నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సింగరేణిలో చోటుచేసుకున్న సోలార్ పవర్ స్కాంపై ప్రభుత్వం మౌనం పాటించడంపై కూడా హరీష్‌రావు ప్రశ్నలు సంధించారు. ఈ మొత్తం వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక ప్రభుత్వం విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.నైనీ టెండర్‌ను రద్దు చేసినట్టే, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయలేదని ప్రభుత్వాన్ని హరీష్‌రావు నిలదీశారు. ఎంతమంది సాకులు చెప్పినా కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది అన్నది నిజమని, అందులో రేవంత్?రెడ్డి బావమరిది కీలక పాత్ర పోషించారన్నదీ వాస్తవమని వ్యాఖ్యానించారు. స్కాం జరగకపోతే నైనీ టెండర్ల రద్దును ఎందుకు ప్రకటించారో సమాధానం చెప్పాలని డిమాండ్? చేశారు.

ఇటీవల బయటపెట్టిన సోలార్ పవర్ స్కాంపై ప్రెస్‌మీట్‌లో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఎందుకని ప్రశ్నించారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బీఆర్ఎస్‌పై నెట్టే ప్రయత్నం చేసినంత మాత్రాన నిజాలు అబద్ధాలుగా మారవని స్పష్టం చేశారు. జరిగిన స్కాంలు స్కీములుగా మారిపోవని హెచ్చరించారు.ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ ద్వారానే జరగాలని ఉద్దేశంతోనే తాను లేఖ రాశానని హరీష్‌రావు తెలిపారు. రేవంత్‌రెడ్డి, ఆయన బావమరిది కుంభకోణంపై నిష్పక్షపాత విచారణకు హామీ ఇస్తే, భట్టి విక్రమార్కకు కూడా లేఖ రాయడానికి సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

## సింగరేణిలో దోపిడీపై విచారణ జరపాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సింగరేణిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, అనంతరం జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే, గుజరాత్‌ను ఎందుకు లాగుతు న్నారని ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించు కుంటే, ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగు తోందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనన్నారు. ఆ సంస్థలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్ఎస్ పార్టీ నడిపించారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ కుటుంబమే దోచుకుంటే, కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని విమర్శించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానిం చారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే, బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని గుర్తు చేశారు. రూ.42వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుని సింగరేణిని అప్పుల పాల్జేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మంతా దారి మళ్లించడం పరిపాటైందని తెలిపారు. సింగరేణి విషయంలో రెండు పార్టీల తీరును చూసి ప్రజలు, కార్మికులు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. తమ భాగోతం బయటపెడితే, మీ భాగోతం తాము బయటపెడతామంటూ మాట్లాడు కుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు తో సహా అందరినీ సాక్షులుగా పిలిస్తే, అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడ మేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న విశ్వసనీయత దెబ్బతింటుందని తెలిపారు. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్

## బండి సంజయ్, అరవింద్‌లకు కేటీఆర్ లీగల్ నోటీసులు

- ఐదు రోజుల్లో స్పందించకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



**బలగం టీవీ, హైదరాబాద్**

తనపై, తన కుటుంబంపై నిరాధారమైన మరియు పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నేతలు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ ధర్మపురి అరవింద్‌లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. నోటీసు అందిన ఐదు రోజుల్లోగా స్పందించకపోతే సివిల్ మరియు క్రిమినల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి సాక్ష్యాధారాలు లేకుండా దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యల వల్ల తన రాజకీయ ప్రతిష్టకు భంగం కలిగించడమే కాకుండా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నం జరుగుతోందని ఆక్షేపించారు. వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పంపిన నోటీసులో, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఆయన చేసిన ఆరోపణలను కేటీఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా కేటీఆర్ కుటుంబం వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ జనవరి 23న నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇప్పటికే బండి సంజయ్ పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా కొనసాగుతుండగానే, మళ్లీ అదే తరహా తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వక చర్యగా పేర్కొన్నారు.

మరోవైపు ఎంపీ ధర్మపురి అరవింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తీవ్రంగా తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలు అక్షేపణీయమని పేర్కొన్నారు. కేటీఆర్ రాష్ట్ర అభివృద్ధికి, ఐటీ రంగ విస్తరణకు కృషి చేసిన మాజీ మంత్రి కేటీఆర్ అని, అలాంటి వ్యక్తిపై ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడడం రాజకీయ కక్ష సాధింపే నని నోటీసులో వివరించారు. ఇద్దరు బీజేపీ నేతలు తమ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో డిమాండ్? చేశారు. ఐదు రోజుల్లోగా స్పందించకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడితే న్యాయపరంగా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో దోషులకు శిక్ష తప్పదు

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధ్యులైన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, చట్టపరంగా కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపుకు తావులేదని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నుంచి కేటీఆర్ వరకు అందరూ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని స్వయంగా ఒప్పుకున్నారని గుర్తు చేసిన జూపల్లి, అలాంటప్పుడు ఇప్పుడు రాజకీయ కక్ష సాధింపని దొంగ ఏడుపులు ఎందుకని ప్రశ్నించారు. కేటీఆర్, హరీష్‌రావులను నిందితులుగా కాకుండా కేవలం సాక్ష్యులుగానే విచారణకు పిలిచామని ఆయన తెలిపారు. ట్యాపింగ్? ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? అన్న అంశాలపై సమాచారం తెలుసుకునేందుకే వారిని ప్రశ్నిస్తున్నామని, ఈ కేసులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరో తేల్చేందుకే విచారణ కొనసాగుతోందని వివరించారు. అన్ని పార్టీలకు చెందిన బాధితులను విచారణకు పిలిచామని, అయినా బీఆర్ఎస్ నేతలు ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టబద్ధంగానే విచారణ జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. వేల సంఖ్యలో ఫోన్లను ట్యాప్ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ప్రజలకు కూడా తెలియాల్సి ఉందని, అందుకే ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని ముందుకు వెళ్తోందని మంత్రి పేర్కొన్నారు.

## మహిళా కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన గంజాయి ముఠా

**బలగం టీవీ, నిజామాబాద్**

గంజాయి ముఠా బరితెగించింది. పోలీసులను లెక్కచేయకపోవడమే కాకుండా, ఏకంగా కారుతో ఢీకొట్టి చంపే ప్రయత్నానికి తెగబడింది. తెలంగాణలోని నిజామాబాద్ నగరంలో చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనంగా మారింది. గంజాయి ముఠా చేసిన కారుదాడిలో మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మాదవనగర్ ప్రాంతంలో గంజాయి ముఠా తిరుగుతున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వప్నకు సమాచారం అందింది. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి రోడ్డు తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో గంజాయి ముఠా ప్రయాణిస్తున్న కారు అక్కడికి వచ్చింది.విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ సౌమ్య ఆ కారును అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిందితులు ఆమెను కారుతో ఢీకొట్టి వేగంగా అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో సౌమ్యకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. సౌమ్య కేవలం 20 నెలల క్రితమే ఎక్సైజ్ శాఖలో ఉద్యోగంలో చేరారని తోటి సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పోలీసులపై దాడికి పాల్పడిన గంజాయి ముఠాను కఠినంగా శిక్షిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## అందరి బాగోతాలు బయటపెడతాం

- ఫోరెన్సిక్ పైలెట్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు..
- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్..
- ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



# కోదాడ లాకప్ డెత్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్..

● తెలంగాణ డీజీపీ, సూర్యాపేట కలెక్టర్‌కు నోటీసులు

**బలగం టీవీ, సూర్యాపేట**



కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై జోక్యం చేసుకున్న కమిషన్.. సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మరియు పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది.గత ఏడాది నవంబర్ నెలలో ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీక్ష్మఫీ) చెక్కు విషయంలో తనకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన రాజేష్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించారనే ఆరోపణలు ఉన్నాయి. కోదాడ రూరల్ సీఐ, చిలుకూరు ఎస?, ఏఎస? వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తనను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారని, ఆ హింస భరించలేకే రాజేష్ మృతి చెందారని మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ దారుణ ఘటనపై రంగారెడ్డి జిల్లాకు చెందిన ఢిల్లీ యూనివర్సిటీ లా స్టూడెంట్ సభావత్ కళ్యాణ్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కళ్యాణ్ ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ, ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై తక్షణమే మేజిస్ట్రీరియల్ విచారణ జరపాలని ఆదేశించింది. రాబోయే ఎనిమిది వారాల్లో ఈ ఘటనపై తీసుకున్న చర్యలు మరియు మేజిస్ట్రీరియల్ విచారణ నివేదికను అందజేయాలని తెలంగాణ డీజీపీ, సూర్యాపేట జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనలో బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మరియు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక దళిత సంఘాలు మరియు పౌర సమాజం డిమాండ్ చేస్తున్నాయి.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం..

**బలగం టీవీ, హైదరాబాద్**




హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట భూ వివాదం విషయంలో కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారంటూ న్యాయస్థానం ఆయనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "న్యాయస్థానంతో ఆటలాడుకోవాలని చూడొద్దు" అంటూ ధర్మాసనం ఈ సందర్భంగా ఘాటు వ్యాఖ్యలు చేసింది.బతుకమ్మకుంట భూమికి సంబంధించి గత ఏడాది జూన్ 12న హైకోర్టు స్టేటస్ కో (యథాతథ స్థితి) ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి హైడ్రా కమిషనర్ రంగనాథ్ అక్కడ పర్యటించారని, భూ హక్కులు కోరుతున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి గతంలో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణలో రంగనాథ్ ఈ విషయంలో కోర్టుకు క్షమాపణలు కూడా చెప్పారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా రంగనాథ్ బతుకమ్మకుంట వద్ద నిర్వహించిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆయన చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు వివాదానికి కారణమయ్యాయి.. ఆ ప్రాంతంలో జిమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం. మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాలతో ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించడం. జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్ రావులతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా కోర్టు రంగనాథ్?ను నిలదీస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది.. "కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద ప్రాంతాన్ని, ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎలా సందర్శిస్తారు? అక్కడ సమావేశాలు నిర్వహించి, అన్ని అధికారాలు తనకే ఉన్నట్లు బహిరంగ ప్రకటనలు ఎలా చేస్తారు?" అని ధర్మాసనం ప్రశ్నించింది.

# ఆదర్శంగా నిలిచిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వివాహం..

● యాదాద్రి భువనగిరి జిల్లాలో చౌటుప్పల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎలాంటి ఆడంబరం లేకుండా రిజిస్టర్ వివాహం చేసుకున్న అధికారులు

**బలగం టీవీ, యాదాద్రి:**



నేటి కాలంలో పెళ్లి అంటేనే కోట్ల ఖర్చు, ఆడంబరాలు, ఆర్భాటాలు కనిపిస్తుంటాయి. కానీ, సమాజానికి మార్గదర్శకులుగా ఉండాల్సిన ఇద్దరు ఉన్నతాధికారులు మాత్రం అత్యంత సాదాసీదాగా వివాహం చేసుకుని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఈ ఆదర్శ వివాహం జరిగింది.

చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువ ఐపీఎస్ అధికారిణి శేషాద్రిని రెడ్డి, కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డిలు చట్టబద్ధంగా రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. ఎలాంటి బ్యాండ్ మేళాలు, భారీ ఊరేగింపులు లేకుండా, కేవలం అతికొద్ది మంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో సంతకాలు చేసి ఒక్కటయ్యారు. వధువు శేషాద్రిని రెడ్డి (ఐపీఎస్) -- ప్రస్తుతం కుత్బుల్లాపూర్ డీసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వరుడు శ్రీకాంత్ రెడ్డి (ఐఏఎస్) -- ప్రస్తుతం ఐఏఎస్ ట్రైనింగ్‌లో ఉన్నారు. పదవులు, హోదాలు ఉన్నా సామాన్యంగా వివాహం చేసుకోవడం ద్వారా ఈ జంట యువతకు గొప్ప సందేశాన్ని ఇచ్చింది. ఈ వేడుకకు పలువురు ఉన్నతాధికారులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆడంబరాలకు దూరంగా జరిగిన ఈ పెళ్లి ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఉన్నత చదువులు చదివి, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్ బామ్మర్ది కోసమే సింగరేణి స్కామ్

● భట్టి మాటలే నిజాన్ని బయటపెట్టాయి

● ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్

**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బామ్మర్ది ప్రయోజనాల కోసమే భారీ కుంభకోణానికి తెరలేపారని బీఆర్?ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తున్న వ్యాఖ్యలే ఈ స్కామ్ నిజమని నిరూపిస్తున్నాయని ఆయన అన్నారు. శనివారం తెలంగాణ భవన్?లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.సింగరేణి టెండర్ల వ్యవహారంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తున్న సమర్థనలు చూస్తుంటే, ఇందులో భారీ స్థాయిలో అవినీతి జరిగిందనేది స్పష్టంగా అర్థమవుతోందని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. "టెండర్లు రద్దు చేశామని చెబుతున్నారు. కానీ అసలు ఏ కారణంతో రద్దు చేయాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. రేవంత్ రెడ్డి తన బామ్మర్ది కళ్లలో సంతోషం చూడటానికి, తన అనుయాయులకు లాభాలు చేకూర్చేందుకు సింగరేణి బొగ్గు గనులను అప్పనంగా కట్టబెట్టాలని చూశారు" అని ఆరోపించారు.




అంతా రేవంత్ రెడ్డి స్క్రీన్ ప్లే

భట్టి విక్రమార్కపై పత్రికల్లో వస్తున్న కథనాల వెనుక కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఉన్నారని శ్రవణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు."భట్టిపై వార్తలు వేయించిన వ్యక్తి ఎవరు? ఆ కథ, ఆ స్క్రీన్ ప్లే మొత్తం రేవంత్ రెడ్డిదే. తన సొంత కేబినెట్ సహచరుడిపైనే లీకులు ఇప్పిస్తున్న ముఖ్యమంత్రి తీరును భట్టి ఎందుకు ప్రశ్నించడం లేదు? భట్టి ఎవరికి భయపడుతున్నారు?" అంటూ నిలదీశారు. సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని ఆధారాలతో సహా మాజీ మంత్రి హరీష్ రావు బయటపెట్టిన వెంటనే ప్రభుత్వం తట్టుకోలేక సిట్ (రాక్షీ) నోటీసులతో వేధింపులకు పాల్పడుతోందని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. "ఒకే అంశంపై రెండు సిట్లు వేయడం హాస్యాస్పదం. రాష్ట్రాన్ని నడుపుతోంది ప్రభుత్వం కాదు, పోలీసులా? లేక ప్రజాప్రతినిధులా?" అని ప్రశ్నించారు.

భట్టి విక్రమార్క తన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారని, కానీ 50 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్?పై సీఎం రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారని శ్రవణ్ ప్రశ్నించారు. "ఎదుటివారిని గౌరవించినప్పుడే మీకు గౌరవం దక్కుతుంది" అంటూ హితవు పలికారు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితిని "తెలంగాణ రైజింగ్ – – పాలన ఫాలింగ్"గా అభివర్ణించిన దాసోజు శ్రవణ్, గత రెండేళ్లలో ప్రభుత్వం నుంచి ఒక్క విధానపరమైన పాలసీ కూడా రాలేదని విమర్శించారు.

"ఇక్కడ నడుస్తోంది అభివృద్ధి పాలసీ కాదూ దోపిడీ పాలసీ. గాదె కింద పందికొక్కుల్లా రాష్ట్ర ఖజానాను దోచుకుంటున్నారు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ మైండ్‌సెట్‌తో పాలన సాగిస్తున్నారని శ్రవణ్ ఎద్దేవా చేశారు. "రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను కూడా రియల్ ఎస్టేట్ ఆఫీసులుగా మార్చాలనుకుంటున్నారా? టీ-- హబ్?ను రిజిస్ట్రేషన్ ఆఫీసుగా మార్చాలని చూడటమే ఇందుకు నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కలలు కంటున్న రేవంత్ రెడ్డి, ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రజల కోసం పని చేయాలని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. "అక్రమాలకు పాల్పడితే కాలమే సమాధానం చెబుతుంది" అంటూ తన వ్యాఖ్యలను ముగించారు.

# అన్ని రంగాల్లో రాణించాలి.. ఉన్నత స్థానాలకు ఎదగాలి..

● ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఫ్లెక్సిపై బాలికలను ఉద్దేశించి స్కై ఇస్ ద లిమిట్ అని రాశారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాల్లో వ్యాస రచన, డ్రాయింగ్, స్పీచ్ ఇతర పోటీలు నిర్వహించగా, విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలించి.. అభినందించారు. విజేతలకు ఇంచార్జి కలెక్టర్ చేతుల మీదుగా డిక్షనరీలు



పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. బాలికలు, బాలుర మధ్యలో ఉన్న జనాభా సంఖ్య అంతరం తగ్గాలని,పలువురు మహిళలు ఉన్నత స్థానాల్లో ఉండగా వారి విజయగాథలు వివరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతం నుంచి తన రాజకీయ జీవితం ప్రారంభించి, ఎన్నో ఇబ్బందులను అధిగమించి దేశ రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి మేరికోమ్ ఎన్నో కష్టాలను ఎదుర్కొని బాక్సింగ్ లో విశేష ప్రతిభ చూపి ప్రపంచ క్రీడల్లో పథకాలు సాదించారని గుర్తు చేశారు. ఇరా సింఘాల్ 62 శాతం వైకల్యం ఉన్నా 2014 యూపీఎస్సీ పరీక్షల్లో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించి, ఐఏఎస్ గా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులు ఉన్నా వారు ఉన్నత స్థానాలకు ఎదిగారని అన్నారు. విద్యార్థినులు సానుకూల దృక్పథంతో మంచి ప్రణాళిక ప్రకారం చదవాలని ఉన్నత స్థానాలకు ఎదగాలని, వివిధ ఉపాధి కల్పించే వృత్తుల్లో, ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీశ్ రావుపై ఆరోపణలను ఖండించిన బీఆర్ఎస్ ఎన్ఆర్ఐలు

**బలగం టీవీ, హైదరాబాద్**




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుపై జరుగుతున ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ గ్లోబల్ బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ నేత మహేష్ బిగాల ఆధ్వర్యంలో జూమ్ వేదికగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన నాయకత్వాన్ని రాజకీయ కక్షతో టార్గెట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టి కేసులు, విచారణలతో కాలయాపన చేస్తోందని విమర్శించిన ఎన్ఆర్ఐలు.. రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు.

# పెద్దూరు పాఠశాలకు పదివేల రూపాయల విలువైన పోడియం బహుకరణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు మరియు వారిలో స్టేజ్ ఫియర్ (సభా భయం) పోగొట్టేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీహెచ?స్ పెద్దూరు పాఠశాల ఉపాధ్యాయ బృందం కొనియాడారు.ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆకుల రాకేష్, ఆకుల పవన్ ల తండ్రి ఆకుల భూమేష్ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ పదివేల రూపాయల విలువైన అత్యాధునిక పోడియంను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా భూమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఈ పోడియం ను ఉపయోగించుకొని ప్రతి సభా వేదికలో మాట్లాడుతూ స్టేజి ఫియర్ ని పోగొట్టుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సభా వేదికలపై మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. ఈ పోడియం వారిలో ఆత్మవిశ్వాసాన్ని, భావ ప్రకటన నైపుణ్యాలను పెంపొందించడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాను. ప్రతి విద్యార్థి భయం వీడి స్టేజీపై మాట్లాడి ప్రయోజకులు కావాలని అన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన భూమేష్ కి ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, ఏపీపీసీ చైర్ పర్సన్ తిప్పవరం సుధ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, జనగాం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమ, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, గడ్డి మహేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు మీద నిర్లక్ష్యం.. ప్రాణాలకు ప్రమాదం..

- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రాణాల రక్షణ
- వాహనదారుల నిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదాలకు కారణం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- 2కే వాకథాన్, ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి వాహనదారుడి సామాజిక బాధ్యత అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్స వాల సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో నిర్వహించిన అరైవ్.. అలైవ్.. అలెర్ట్ -- రన్ ఫర్ రోడ్ సేఫ్టీ 2కే వాకథాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు గా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.చెక్కపల్లి చౌరస్తా నుంచి కోర్టు కాంప్లెక్స్ మైదానం వరకు నిర్వహించిన వాకథాన్?ను అతిథులు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు పలు చర్యలు తీసుకుంటోందన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వేసుకోవాలని సూచించారు. నో హెల్మెట్ -- నో పెట్రోల్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్?ను అభినందించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ చిన్న చిన్న నిర్లక్ష్యాల వల్ల అనేక మంది విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయన్నారు.

ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నో ఓవర్ స్పీడ్, నో డ్రంక్ అండ్ డ్రైవ్, నో హెల్మెట్ -- నో డ్రైవ్, నో ఫోన్ -- నో డ్రైవ్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. రోడ్ సేఫ్టీ అంటే లైఫ్ సేఫ్టీ అని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించక పోవడం వల్ల ప్రాణనష్టం జరుగుతుందన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రమాదాలకు గురైన వాహనాల ప్రదర్శన ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాల కారణాలపై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రుత్విక్ సాయి , అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్ పై కక్షసాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం..



- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో నోటీసులు, కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంచర్ల రవి గౌడ్? మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతును అణచివేయాలనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్?లోనే ఈ రాజకీయ డ్రామా నడుస్తోందని, ఇది ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా కేటీఆర్ ను ఏమీ చేయలేరని, ఆయన ప్రజల విశ్వాసం పొందిన నాయకుడని స్పష్టం చేశారు. కేటీఆర్ ని చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వణుకుతోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తే నోటీసులు పంపించడం ఇదేనా ఇంద్రమ్మ రాజ్యం? ఇదేనా ప్రజాపాలన? అని ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల పక్షాన నిలబడే కేటీఆర్ పోరాటాన్ని ఆపలేరని కంచర్ల రవి గౌడ్ తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మట్ట శ్రీనివాస్, ఎస్.కె అప్రోచ్, ఆరెల్లి వినయ్ కుమార్, వినయ్, వంశీ, నవీన్, రాజు, శ్రీకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతే లక్ష్యం, వేములవాడలో 'రన్ ఫర్ రోడ్ సేఫ్టీ' 2కే రన్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రహదారి నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం "వాక్థాన్ -- రన్ ఫర్ రోడ్ సేఫ్టీ" పేరిట 2కే రన్ నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించాలని కోరారు. ప్రజలు, ముఖ్యంగా యువత మరియు విద్యార్థులలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడమే ఈ 2ఖ రన్ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. శనివారం ఉదయం 07:00 గంటలకు చెక్కపల్లి చౌరస్తా నుండి బాలనగర్ కోర్టు గ్రౌండ్ వరకు, రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వేములవాడ పట్టణంలోని ప్రజలు, యువత, విద్యార్థులు



మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వాక్థాన్‌ను విజయవంతం చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ వేంకటేశ్వర్లు, ఆర్.ఐ లు రమేష్, సురేష్, ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ రాజు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు

# అందరి బాగోతాలు బయటపెడతాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములు కాజేసిన వారిని, రిజిస్ట్రేషన్ చలానా సొమ్మును దోచుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అందరి బాగోతాలను త్వరలోనే ప్రజల ముందుకు తీసుకొస్తామని హెచ్చరించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ధరణి పోర్టల్ అక్రమాలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో అనేక అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ప్రాథమిక నివేదికను పరిశీలించిన అనంతరం, మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

విచారణలో ఎదురైన అంశాలు, అక్రమాల్లో ఎవరి పాత్ర ఎంత, తెరవెనుక ఎవరు ఉన్నారు, రెవెన్యూ అధికారుల ప్రమేయం ఉందా వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నట్లు మంత్రి తెలిపారు. మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించినట్లు చెప్పారు.ధరణి పోర్టల్ ప్రారంభమైన తర్వాత జరిగిన మొత్తం 52 లక్షల లావాదేవీల్లో 35 లక్షల లావాదేవీలను పరిశీలించామని, అందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు గుర్తించినట్లు వెల్లడించారు. విచారణ అనంతరం 1,109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు రూ.4 కోట్ల మేర ప్రభుత్వానికి చెల్లింపులు జరగలేదని కమిటీ సభ్యులు తేల్చినట్లు మంత్రి వివరించారు.

ఆనాటి ప్రభుత్వం ముందుచూపు లేకుండా, కుట్రపూరితంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్?లోని లొసుగుల వల్లే ఈ అక్రమాలు జరిగాయని విమర్శించారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి, వెంటనే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు తొమ్మిది జిల్లాల పరిధిలోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే, ప్రతిపక్ష నాయకులు నోటికొచ్చినట్లు వెయ్యి కోట్లు, పది వేల కోట్లు అంటూ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు.ఇక జనవరి 25న ఖమ్మం జిల్లాలో శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్సులు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే తొలి విడతలో నాలుగు వేల మందికి లైసెన్సులు జారీ చేయగా, ఖమ్మం జిల్లా కలెక్టరేట్?లో మరో రెండు వేల మందికి లైసెన్సులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు.



# ఓటు హక్కు వినియోగం ప్రతి పౌరుడి బాధ్యత..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. శనివారం "మై ఇండియా.. మై ఓట్" అనే థీమ్?లో 16వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల ఉద్యోగులు భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఏవైనా ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రజాస్వామ్య సంప్రదాయాలను నిలబెట్టే బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని అన్నారు.అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల గ్రామపంచాయతి ఎన్నికలు ప్రజల సహకారంతో ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలు జరుపుతూ ఓటర్ నమోదు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పిస్తామని అన్నారు. 18 ఏండ్ల వయసు వచ్చిన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు ఉందని, నిరంతరంగా ఓటు నమోదు చేసే అవకాశం అందుబాటులో ఉందని అన్నారు. అనంతరం ఎక్కువసార్లు ఓటు హక్కు వినియోగించిన సీనియర్ ఓటర్లు, నూతన ఓటర్లను ఇంచార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ సన్మానించారు. అలాగే నూతన ఎపిక్ కార్డులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, సీపీఓ శ్రీనివాసాచారి తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# సిరిసిల్ల మున్సిపల్ బరిలో జనసేన..

- యువతకు ఆహ్వానం పలికిన ఆర్.కే. సాగర్
- రాజన్న సిరిసిల్ల జనసేన విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్.కే. సాగర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన జనసేన విస్తృత స్థాయి సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఆర్.కె. సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఆర్.కె. సాగర్ మాట్లాడుతూ.. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని సాగర్ స్పష్టం చేశారు. కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేసి పార్టీని విజయపథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. "సిరిసిల్ల అంటే చేనేత.. చేనేత అంటే సిరిసిల్ల" అని కొనియాడుతూ, చేనేత కార్మికులంటే పవన్ కళ్యాణ్?కు ఎంతో గౌరవమని, అందుకే ఆయన నిరంతరం చేనేత వస్త్రాలనే ధరిస్తారని గుర్తుచేశారు. జనసేన పార్టీ చేనేత కార్మికులకు అండగా ఉంటుందని అన్నారు. రాజకీయాల్లో మార్పు రావాలంటే నిరుద్యోగులు, యువత రాజకీయాల్లోకి రావాలని, వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జనసేన పార్టీ అడ్ హక్ కమిటీ సభ్యులు పెంటల మహేష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఆర్.కె. సాగర్ సమక్షంలో జనసేన పార్టీ లో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆర్.కె. సాగర్ ఆహ్వానించారు. తెలంగాణ గడ్డ మీద పురుడు పోసుకున్న జనసేన పార్టీ, నేటికి 12 ఏళ్లు పూర్తి చేసుకుని జనం కోసమే నిలబడింది. ఈ పార్టీకి యువతే అసలైన పునాదని ఆర్.కె. సాగర్ అన్నారు. సిరిసిల్ల లాంటి చైతన్యవంతమైన గడ్డపై జనసేన ఉనికిని చాటుకోవడం ద్వారా రాబోయే ఎన్నికల్లో రాణించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసేన వీరమహిళలు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు రాజకీయ డ్రామానే




- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం రూపొందించిన డ్రామా తప్ప మరొకటి కాదని బీఆర్?ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన విస్తృత మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కూడా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. "ఇది సిట్ కాదు, పిట్ కూడా కాదు. ఇది ఒక డెయిలీ సీరియల్. స్టాండ్ అంటే స్టాండ్, సిట్ అంటే సిట్. కానీ ప్రస్తుతం జరుగుతున్నది రాజకీయ డైవర్షన్ డ్రామా మాత్రమే" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని, ఇచ్చిన హామీలను అమలు చేసే సామర్థ్యం లేదని విమర్శించారు.

**హామీల అమలులో విఫలం– దృష్టి మళ్లించేందుకు వరుస డ్రామాలు**

ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై మాట్లాడకుండా ప్రభుత్వం కావాలనే వివిధ కుంభకోణాల పేరుతో ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. "కొన్ని రోజులు కాళేశ్వరం కుంభకోణం అంటారు, మరికొన్ని రోజులు ఫోన్ ట్యాపింగ్ డ్రామా, ఆ తర్వాత గొర్రెల స్కాం, ఫార్ములా––ఈ అంటూ వరుసగా డ్రామాలు చేస్తున్నారు. ఈ రెండేళ్లలో ఈ డ్రామాలు తప్ప ప్రజలకు ఇచ్చింది ఏమీలేదు" అని మండిపడ్డారు.

**సింగరేణి బొగ్గు కుంభకోణంపై ప్రశ్నలు**

ఇటీవల హరీష్ రావు బయటపెట్టిన సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని ప్రస్తావించిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి బావమరిది ఆధ్వర్యంలో వేల కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణం జరుగుతున్నట్లు ఆధారాలతో చూపిస్తే, విచారణ చేయకుండా వెంటనే సిట్ నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు. నిజంగా సిట్ వేయాల్సిన వారు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుమారుడిపై ఉన్న భూకబ్జాల ఆరోపణలేనని డిమాండ్ చేశారు. అలాగే రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి నేరుగా బొగ్గు కుంభకోణంలో పాల్గొన్నట్లు ఆధారాలు ఉన్నప్పటికీ, ఆయనపై ఎలాంటి విచారణ లేదని ఆక్షేపించారు.

**కేంద్ర ప్రభుత్వ వైఖరిపై విమర్శలు**

కేంద్ర ప్రభుత్వ స్పందనను కూడా కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. "రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేస్తేనే సీబీఐ విచారణ జరుగుతుందన్న మాటలు వినిపిస్తున్నాయి. పట్టపగలే దోపిడీ చేసిన దొంగే పోలీస్ స్టేషన్?కు వచ్చి నేను దొంగతనం చేశాను అని చెబుతాడా?" అని వ్యంగ్యంగా ప్రశ్నించారు.

అమృత్ పథకంలో అర్హతలు లేకున్నా రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీకి కాంట్రాక్టులు దక్కిన విషయాన్ని ఆధారాలతో సహా ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి అందజేశానని తెలిపారు. "దానిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు" అని అన్నారు.

**గచ్చిబౌలి భూముల కుంభకోణంపై స్పందించని కేంద్రం**

గచ్చిబౌలి ప్రాంతంలోని భూముల్లో రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని సుప్రీం కోర్ట్ నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో 'ఆర?ర్ టాక్స్' అమలవుతోందని చెబుతారు. కానీ దానిపై విచారణ ఎందుకు లేదు?" అని నిలదీశారు.

**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం -- రాజకీయాలకు సంబంధం లేదు**

ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ, ఇది దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన నిఘా వ్యవస్థలో భాగమని కేటీఆర్ స్పష్టం చేశారు. "ఇది నిన్న మొన్నటి వ్యవస్థ కాదు. 1952 నుంచి నెహ్రూ కాలం నుంచి ఈ రోజు వరకు కొనసాగుతోంది. ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రలు జరిగితే వాటిని అడ్డుకోవడం కోసం నిఘా వ్యవస్థ ఉంటుంది. దీనిలో మంత్రులకు, రాజకీయ నాయకులకు ఎలాంటి పాత్ర ఉండదు" అని అన్నారు.

నిజంగా విచారణ చేయాలంటే అప్పటి ఇంటెలిజెన్స్ ఐజీలు, డీజీపీలను పిలవాలని సూచించారు. "అప్పుడు ఇంటెలిజెన్స్ ఐజీగా ఉన్న శివధర్ రెడ్డి, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, జితేందర్ వంటి అధికారులకు ఈ విషయాలు తెలుసు. వారిని పిలవకుండా రాజకీయ నాయకులనే టార్గెట్ చేయడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు.

**రాజకీయ వేధింపులే లక్ష్యం**

ప్రతిపక్ష నేతల ఫోన్లు ప్రస్తుతం ట్యాప్ కావడం లేదని ఏ ఒక్క అధికారి అయినా అధికారికంగా చెప్పగలరా? అని కేటీఆర్ సవాల్ విసిరారు. "మళ్లీ మా ప్రభుత్వం వస్తే ఈ వ్యవహారంపై విచారణ జరిగితే నిజాలు బయటకు వస్తాయి. అందుకే అధికారులు మాట్లాడలేకపోతున్నారు" అని అన్నారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోసమేనని ఆరోపించిన కేటీఆర్, "మేము ఎలాంటి తప్పు చేయలేదు. కాబట్టి భయపడే ప్రసక్తే లేదు. సిట్ విచారణకు హాజరవుతాం" అని స్పష్టం చేశారు.

రెండేళ్ల పాలనలో ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకం కూడా అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. "మహిళలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీలు, నూరు రోజుల హామీల సంగతి ఏమైంది? ఇవన్నీ మర్చిపోయి కేసుల పేరుతో కాలక్షేపం చేస్తున్నారు" అని అన్నారు. చివరగా, "ఇది లొట్టపీసు కేసు. ఇందులో ఏమీలేదు. పోలీసులను రాజకీయ క్రీడలో బలిపశువులను చేస్తున్నారు" అంటూ కేటీఆర్ తన వ్యాఖ్యలను ముగించారు.

# 'ఈగల్ కాయిన్' పేరిట భారీ మోసం

- ఈగల్ కాయిన్ క్రిప్టో కరన్సీ పేరుతో మల్టి లెవెల్ మార్కెటింగ్ అని చెప్పి మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు
- ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి
- వివరాలు వెల్లడించిన పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

క్రిప్టో కరన్సీ పేరుతో అమాయక ప్రజలను నమ్మించి, మల్టీ లెవల్ మార్కెటింగ దందాకు పాల్పడుతూ లక్షల రూపాయలు వసూలు చేసిన ఆరుగురు వ్యక్తులపై సిరిసిల్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఇన్?స్పెక్టర్ కృష్ణ ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి 'జుస్త్రుశ్రీ జశీఱఅ' అనే ఆన్?లైన్ కంపెనీ పేరుతో మోసాలకు తెరలేపారు. తక్కువ కాలంలోనే అధిక లాభాలు వస్తాయని, ఇది ఒక చైన్ సిస్టమ్ అని నమ్మబలికి ప్రజల నుండి భారీగా పెట్టుబడులు సేకరించారు.

విద్యానగర్‌కు చెందిన ముచ్చ రాజేందర్ అనే బాధితుడు ఈ ముఠా మాటలు నమ్మి రూ. 11 లక్షలు ఇన్వెస్ట్ చేశారు. 18 నెలల్లో రూ. 30 లక్షలు వస్తాయని నిందితులు హామీ ఇచ్చారు. అయితే, కేవలం రూ. 1.20 లక్షలు మాత్రమే వచ్చాయని, బాధితుడు తన డబ్బు తిరిగి ఇవ్వాలని నిలదీయగా నిందితుల నుండి సరైన సమాధానం రాకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. ఎక్కువ లాభాల ఆశచూపి మోసం చేసే ఇలాంటి ఆన్?లైన్ వెబ్?సైట్లు మరియు క్రిప్టో



కరెన్సీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.సిరిసిల్లకు చెందిన నింది తులు.. పాశికంటి లవన్ కుమార్ (33), దోమల ప్రవీణ్ (41), ఆడెపు శ్రీధర్ (44), వంగరి వేణు గోపాల్ (40), మంచికట్ల సుధాకర్ (42), సుభాష్ లు అనే ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ తెలిపారు. ఈగల్ కాయిన్ పేరుతో మోసపోయిన బాధి తులు ఇంకా ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకు వచ్చి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఇన్స్పెక్టర్ కోరారు.



## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం
## జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన వజ్రాయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రాథమిక బాధ్యత అని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు లొంగకుండా, తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడవచ్చునని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన మన దేశంలో ఓటు విలువపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. "ప్రజలను చైతన్యం చేయడం, వారికి ఓటు విలువను వివరించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవచ్చు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా మనమందరం కృషి చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు రవి, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు, పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## పెద్దూరు పాఠశాలకు 43 ఇంచుల స్మార్ట్ టీవీ బహుకరణ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్థానిక ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం సాంకేతిక విద్యను చేరువ చేసే ఉద్దేశంతో టేకు సంధ్య జంపరాజు ఉదారత చాటుకున్నారు. విద్యార్థుల కోసం స్మార్ట్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా వారు 43 ఇంచుల టెలివిజన్?ను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీవీని అందజేశారు. ఈ విరాళం విద్యార్థులకు డిజిటల్ పాఠాలు నేర్చుకోవడంలో ఎంతో దోహదపడుతుందని పాఠశాల వర్గాల వారు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడిన టేకు సంధ్య జంపరాజు కి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, ఏపీసీ చైర్ పర్సన్ తిప్పవరం సుధ మరియు ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, జనగాం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమ, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, గడ్డి మహేష్ తదితరులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు కూడా పాల్గొని దాతకు ధన్యవాదాలు తెలిపారు.






## నేతాజీ డిగ్రీ కళాశాలలో మిన్నంటిన 'నేతాజీ యూత్ ఫెస్టివల్' సంబరాలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని సిరిసిల్లలోని నేతాజీ డిగ్రీ కళాశాలలో 'నేతాజీ యూత్ ఫెస్టివల్' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బోస్ ఆశయాలను స్మరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నేతాజీ జీవిత విశేషాలను, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చేసిన త్యాగాలను వివరిస్తూ ఉత్తేజకరమైన ఉపన్యాసాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థిని-విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యం చేస్తూ, నాటికల ద్వారా స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ జూపల్లి పృథ్వీధర్ రావు గారు మాట్లాడుతూ.. "నేతాజీని ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి. ఆ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పట్టుదలతో అనుకున్న విజయాలను అందుకోవాలని హితవు పలికారు. అలాగే ప్రిన్సిపాల్ శ్రీకాంత్ గారు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును ఘనంగా నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కళాశాల డైరెక్టర్ జూపల్లి పద్మాదేవి, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేశారు.